## రైతులు, కౌలురైతుల మధ్య చిచ్చుపెట్టే కాంగ్రెస్ వద్దు



నెక్కొండ: కాంగ్రెస్ పార్టీ ధరణిని రద్దు చేస్తామని, కౌలురైతుల కాలమ్ పెడతామని, రైతులు, కౌలురైతుల మధ్య చిచ్చు పెట్టిస్తోంది. సీఎం కేసీఆర్ 24గంటల ఉచిత కరెంట్‌తోపాటు పుష్కలంగా సాగునీరు అందించడంతో రైతులు రెండు పంటలు పండించుకుంటున్నరు. కౌలు రైతుల కాలమ్ చేర్చి రైతుబంధును పట్టాదారుకు కానీ, కౌలు రైతులకు కానీ ఎవరికో ఒకరికి ఇస్తమని పీసీసీ అధ్యక్షుడు ప్రకటించడం దారుణం. పట్టాదారు, కౌలురైతులు పరస్పరం అవగాహనతో పంటలను సాగుచేసుకుంటున్నారు. రైతుల మధ్య కొట్లాటలకు పురిగొల్పే కాంగ్రెస్ విధానాలను రైతులంతా తిప్పికొట్టాలి. రైతులను ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలి.

***- కొత్త సమ్మిరెడ్డి, రైతు, పనికర, నెక్కొండ మండలం***

## రైతులంతా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలె..



నెక్కొండ: కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నా పరిష్కరించలె.. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నడు. కాంగ్రెసోళ్లు ధరణి రద్దు చేసి కౌలుదారులకు హక్కులు కల్పిస్తే రైతులు కొట్టుకుంటరు. కౌలు చేసేందుకు భూమి దొరకదు. భూ యజమాని తన భూమిని కౌలుదారుకు ఇవ్వడు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పట్టాదారుకైనా, కౌలుదారుకైనా ఎవరో ఒకరికి రైతుబంధు నిధులిస్తా అంటున్నడు. అన్నీ దమాక్ లేని మాటలు. రైతుబంధు ఇస్తుంటే ఏ రైతైనా వదులుకుంటడా. అన్నీ వచ్చిరాని మాటలు మాట్లాడుతుండు. రైతులందరూ సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలువాలి.

***- కాడబోయిన కుమారస్వామి, రైతు, పనికర, నెక్కొండ మండలం***



## కాంగ్రెస్ అభ్యర్థిపై కేసు నమోదు

చెన్నారావుపేట, నవంబర్ 28: నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దొంతి మాధవరెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై తోట మహేందర్ కథనం ప్రకారం.. కాంగ్రెస్ అభ్యర్థి మాధవరెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా సోమవారం రాత్రి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారని తెలిపారు. అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహించడం ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకమని పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ర్యాలీ, సమావేశం నిర్వహించినట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ మణితేజ ఫిర్యాదు మేరకు మాధవరెడ్డితోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

## అమెరికా రోడ్డు ప్రమాదంలో గంటూర్‌పల్లి వ్యక్తి మృతి

హసన్‌పర్తి, నవంబర్ 28: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంటూర్‌పల్లికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని గంటూర్‌పల్లికి చెందిన పెద్ది గోవర్ధన్‌రెడ్డి(45)కి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు పెద్ది వంశీకృష్ణ 20నెలల క్రితం పైచదువుల కోసం అమెరికాకు వెళ్లాడు. ఈనెల 4న గోవర్ధన్‌రెడ్డి కుమారుడిని చూసేందుకు వెళ్లాడు. సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు డెడ్‌బాడీని ఇండియాకు తీసుకురావాలని కుటుంబసభ్యులు మంగళవారం ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను కలిసి కోరగా సానుకూలంగా స్పందించారు.

## రెండు పంటలకు నీళ్లిచ్చిన ‘పెద్ది’కే మా ఓట్లు


నల్లబెల్లి, నవంబర్ 28: బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డికి ప్రజలు ఫ్లెక్సీ కట్టి మద్దతు తెలుపుతున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు ఉడుత బాబు తన ఇంటి ముందు పెద్దికే తాము ఓటు వేస్తామని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ‘రెండు పంటలకు నీళ్లిచ్చిన మా నాయకుడు మా పెద్ది సుదర్శన్‌రెడ్డి గారి కారు గుర్తుకే మా ఓట్లు’ అంటూ కుటుంబ సభ్యులు ఫ్లెక్సీ కట్టారు. సీఎం కేసీఆర్ సహకారంతో డీబీఎం–38 కెనాల్ ద్వారా పుష్కలంగా సాగు నీరు ఇస్తుండగా, మండలానికి పెద్ద దిక్కుగా ఉన్న రంగాయచెర్వులోకి గోదావరి జలాలతో నింపి గొలుసుకట్టు చెరువుల ద్వారా నింపారు. దీంతో రైతులందరూ కారు గుర్తుకే ఓటు వేసి ‘పెద్ది’ని గెలిపిస్తామని అంటున్నారు.




నల్లబెల్లిలో ‘పెద్ది’కి మద్దతుగా తన ఇంటి ముందు ఫ్లెక్సీ కట్టిన రైతు బాబు

## ‘పెద్ది’ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

నర్సంపేట రూరల్, నవంబర్ 28: బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆకులతండాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నియోజకవర్గ అభివృద్ధికే పట్టం కట్టాలని కోరారు. మరోసారి ఎమ్మెల్యే పెద్దిని ఆశీర్వదించి కారు గుర్తుకు అమూల్యమైన ఓటు వేయాలని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ భూక్య కిషన్, క్లస్టర్ ఇన్‌చార్జిలు కడారి కుమారస్వామి, తాళ్లపెల్లి రాంప్రసాద్, పాశికంటి శంకర్‌లింగం, విజయ్‌కుమార్, రమేశ్, రాజు, కుమారస్వామి, సమ్మాలు ఉన్నారు.



ఆకులతండాలో మాట్లాడుతున్న జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న

# మరింత అభివృద్ధి చేస్తా

- ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్, నవంబర్ 28: ప్రజలు మళ్లీ ఆశీర్వదిస్తే నర్సంపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నర్సంపేట మండలం పర్శనాయక్‌తండాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అజ్మీరా పవన్, కొర్ర లాల్ సింగ్, అజ్మీరా సమ్మయ్యతోపాటు మరికొందరు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పెద్ది పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలామంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. సర్పంచ్ బానోత్ గాంధీ, ముఖ్యనాయకులు కొర్ర రాంలాల్, ఈర్య, తిరుపతి, రమేశ్, రాజు ఉన్నారు. మండలంలోని జీజీఆర్‌పల్లికి చెందిన తుత్తూరు దేవేందర్ తోపాటు మరో ఐదుగురు ఎమ్మెల్యే పెద్ది సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ తుత్తూరు కోమలా రమేశ్, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి పురాని రమేశ్ ఉన్నారు.

## భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

### ఒకరికి తీవ్ర గాయాలు



మోత్య (ఫైల్)

నర్సంపేట, నవంబర్ 28: భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన నర్సంపేటలో మంగళవారం జరిగింది. స్థానికుడైన జరుపుల మోత్య(64) వరంగల్ రోడ్డులోని ఆవని ఆస్పత్రి భవనం పైనుంచి పడడంతో తీవ్రగాయాలు కాగా, అక్కడికక్కడే మృతిచెందాడు. మహేశ్వరానికి చెందిన మోత్య ఆరేండ్లుగా నర్సంపేటలో నివసిస్తున్నారు. ఆర్టీసీలో ఉద్యోగిగా పనిచేసి రిటైర్మెంట్ అయ్యారు. ఆయన పెద్ద కుమారుడు వైద్యుడిగా ఆవని ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఆస్పత్రి పైఅంతస్తు నిర్మిస్తుండగా పరిశీలించేందుకు ఇటుకలు మోసే యంత్రం ద్వారా వెళ్లగా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అతడితోపాటు కింద పడిన భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి.



నర్సంపేట: 15వ వార్డులో పార్టీ శ్రేణుల ప్రచారం




నర్సంపేట: 2వ వార్డులో..



నర్సంపేట: 18వ వార్డులో

## ప్రచారం.. జోరు

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. మంగళవారం పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారం కొనసాగించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. నమూనా బ్యాలెట్ చూపుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : మాదన్నపేటలో..



నర్సంపేట రూరల్ : దాసరిపల్లిలో..



నల్లబెల్లి: శనిగరంలో ..



నర్సంపేట రూరల్ : చంద్రయ్యపల్లిలో..



నెక్కొండ:మండల కేంద్రంలో..



ఖానాపురం: పెద్దికి మద్దతు తెలుపుతున్న దివ్యాంగులు



చెన్నారావుపేట: అమినాబాద్‌లో..



నెక్కొండ: చంద్రుగొండలో బీఆర్ఎస్ ర్యాలీ